న్యూస్ బాక్స్

నేడు జాతీయ లోక్అదాలత్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోకాఅదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కార్యదర్శి స్వప్న రాణి, న్యాయమూర్తులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదిరే కేసులు పరిష్కరిస్తామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన కేసులకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని గుర్తుకు చేశారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ వారు శుక్రవారం తెలిపారు. మంథని సీనియర్ సివిల్ జడ్జి భవాని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి, న్యాయవాదులు, వివిధ శాఖల, బ్యాంక్‌ల అధికారులు పాల్గొంటారని తెలిపారు. కక్షి దారులు పాల్గొని రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

గోదావరిఖని టు గోవా టూర్ ప్యాకేజీ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఈ నెల 23న గోదావరిఖని బస్టాండ్ నుంచి గోవాకు ఉదయం 10గంటలకు రాజధాని ఏసీ బస్సును ఏర్పాటు చేసినట్లు, పర్యాటకులు వినియోగించుకోవాలని ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. గోదావరిఖని బస్టాండ్ నుంచి 23న బయలుదేరి మురుడేశ్వర్ శివుని విగ్రహం, గోకర్ణ (ఆత్మ శివలింగం) దేవాలయాల తోపాటు గోవాలోని బీచ్‌లను సందర్శించుకుని 28న తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని, పెద్దపల్లి పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని, ఒక్కొక్కరికి రూ.8 వేలు చార్జీగా నిర్ణయించామని, వివరాలకు 7013504982, 738284 7596 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



పత్తి రైతులకు శాపంగా సీసీఐ నిబంధనలు

- జిన్నింగ్ మిల్లుల వద్దనే కొనుగోలు కేంద్రాలు
- మార్కెట్ యార్డులో కొనుగోలు చేయని అధికారులు
- రైతులకు దక్కని మద్దతు ధర

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలు శాపంగా మారాయి. మార్కెట్ యార్డుల్లో కాకుండా జిన్నింగ్ మిల్లులు ఉన్న చోటే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడంతో రైతులకు మద్దతు ధరలు దక్కకుండా పోతున్నాయి. నాలుగైదేళ్లుగా సీసీఐ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 52 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు పత్తి పంట చేతికి రానున్నది. జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డులు ఉన్నప్పటికీ ఒక పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోనే పత్తి కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్‌తోపాటు రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల వద్ద, మధ్య దళారులకు, జమ్మికుంట, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తిని విక్రయిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ యార్డుల్లో మద్దతు ధర దక్కనప్పుడు, వారికి సీసీఐ అండగా నిలిచి మద్దతు ధర ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రవాణా చార్జీల భారంతో జిన్నింగ్ మిల్లుల వద్దనే నాలుగేళ్ల నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. నామ్‌కే వాస్తేగా సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నప్పటికీ, తద్వారా పెద్దగా కొనుగోలు చేసేదేమి లేదు. అక్కడ పత్తి విక్రయించే రైతులే రవాణా చార్జీలు భరించి జిన్నింగ్ మిల్లు వద్దకు తీసుకపోవాలనే నిబంధన విధించడంతో చాలా మంది రైతులు వ్యాపారులకే తక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తున్నది. మార్కెట్‌లో మద్దతు ధరలు దక్కడం లేదని భావిస్తున్న తమ వద్దకు వచ్చే దళారులకే పత్తిని విక్ర యించి నష్టపోతున్నారు. జిల్లాలో నాలుగు చోట్ల జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. పెద్దపల్లి మండలం

(మిగతా 6వ పేజీలో..)

బ్లాస్టింగ్‌లతో పంటలు దెబ్బతింటున్నాయి..

రోడ్డుపై బైఠాయించిన బాధితులు



ధర్మారం రహదారిపై బైఠాయించిన రైతులు

పెద్దపల్లిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బొంపల్లి గుట్టపై క్వారీ బ్లాస్టింగ్‌లతో పంటలు దెబ్బతింటున్నాయని శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారం రోడ్డుపై బైఠాయించారు. వెంటనే బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని నినాదాలు చేశారు. రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు అరగంట సమయం వరకు ఆందోళన చేపట్టడంతో పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడి విరమింపజేశారు. ఈ సందర్భం గా సంబంధిత రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 179లో గల సాగు భూములకు ఆనుకొని ఉన్న గుట్టను బ్లాస్టింగ్ చేయడం ద్వారా పంట పొలాల్లో రాళ్లు వచ్చి పడుతున్నాయని, దీంతో పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. పలుమార్లు అధికారులకు, పోలీసులకు, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లి స్టే కూడా తీసుకొచ్చామన్నారు. అయిన కూడా బ్లాస్టింగ్‌లు ఆపడం లేదన్నారు. అధికారులు స్పందించక పోవడం వల్లనే రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నామన్నారు. వెంటనే బ్లాస్టింగ్‌ల ను నిలిపివేసేలా అధికారులు చర్యలు చేపట్టి పొలాలు సాగు చేసుకునే విధంగా సహకరించాలని వారు కోరారు.

యూరియా కోసం రైతుల తోపులాట

సుల్తానాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ సహకార సంఘం గోదాముల వద్ద యూరియా కోసం రైతుల మధ్య శుక్రవారం తోపులాట చోటు చేసుకుంది. గోదాంకు వచ్చిన యూరియా నిల్వల కోసం రైతులు ఉదయం నుంచి క్యూ లైన్‌లో నిలబడి వేచి ఉండగా, ఒకరిద్దరు రైతులు డైరెక్ట్‌గా కౌంటర్ వద్దకు వెళ్లడాన్ని లైన్‌లో నిల్చున్న రైతులు ఆక్షేపించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒక దశలో గొడవ పెద్దది కావడంతో పోలీసులు వచ్చి వారిని శాంతింప చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరుతున్నారు.



సుల్తానాబాద్‌లో యూరియా కోసం తోసుకుంటున్న రైతులు

రెవెన్యూ కార్యాలయానికి తరలిన రైతులు

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రైతులు యూరియా కోసం రెవెన్యూ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఓదెల గ్రామానికి వంద బస్తాలు రాగా 200 మంది రైతులు రైతువేదిక వద్దకు టోకెన్ల కోసం వెళ్లారు. దీంతో వచ్చిన బస్తాలకు సరిపడ ఏఈఓ టోకెన్లు రైతులకు ఇవ్వడంతో, మిగతా రైతులు బస్తాలు కావాలని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ ధీరజ్‌కుమార్ రైతులతో మాట్లాడుతూ సోమవారం 450 యూరియా బస్తాలు వస్తాయని, ఎవరు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అధికారులు స్పందించి రైతులకు సరిపడు బస్తాలను తెప్పించాలని రైతులు అధికారులను కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట దిగుబడులను కొనుగోలు చేసేందుకు పక్కాగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీజన్‌లో ఎంత ధాన్యం వస్తుందో మండలాల వారీగా అంచనాలు తయారు చేయాలన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2389 రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి 2369 రూపాయల మద్దతు ధర చెల్లిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం దిగుబడి ఆధారంగా అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. డీఎస్‌ఓ శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డీసీఓ శ్రీమాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

జిల్లాలో స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2వరకు స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరగనున్నదని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు రోజూ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యా శాఖ, సంక్షేమ శాఖ అధికారి, ఇంటర్మీడియట్ అధికారుల సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లోని బాలికలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, అనేమియా, టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, డీఈఓ డి.మాధవి, డీడబ్ల్యూఓ వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి..

రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మేర టాయిలెట్స్ నిర్మాణ పనులు ఉపాధిహామీ కింద ఏర్పాటు చేయాలన్నారు. ఆర్అండ్ బి ఈఈ భావ్ సింగ్, డీపీఓ వీర బుచ్చయ్య, పీఆర్ ఈఈ ఆర్ గిరీష్ బాబు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ రామన్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ పెత్తనం

- విద్యార్థినులు, తల్లిదండ్రులతో దురుసు ప్రవర్తన

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నర్సింగ్ కళాశాలలో ఓ ఫ్యాకల్టీ పెత్తనంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శారదానగర్‌లో నర్సింగ్ విద్యార్థినుల కోసం సింగరేణి హాస్టల్ భవనాన్ని కేటాయించగా ఇక్కడే తరగతులు బోధిస్తున్నారు. కళాశాలలో పని చేసే ఒక ఫ్యాకల్టీ తమను మానసిక క్షోభకు గుర్తి చేస్తుందని విద్యార్థినులు పేర్కొంటున్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు తల్లిదండ్రులకు ఫోన్ చేయ కుండా దూషిస్తుందని తెలిపారు. సమయం పాటించకుండా హాస్టల్‌కు ఎందుకు వస్తున్నారంటూ హాస్టల్‌కు వచ్చిన తల్లిదండ్రులపై కూడా బెదిరింపు ధోరణిలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఇదేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తుందని తెలిపారు. సిరిసిల్లా జిల్లాలో పని చేసినప్పుడు కూడా ఇదే తీరుగా వ్యవహరించడం, అక్కడి నుంచి స్టాఫ్ నర్సుగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చి ఫ్యాకల్టీగా బాధ్యతలు నిర్వహిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు బయటకు వెళ్లడానికి పర్మిషన్ ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతుందన్నారు. ఇందులో పని చేసే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది కూడా ఏమి చేయలేక పోతున్నారు. ఇటీవల ఆమె పెత్తనంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు, కలెక్టర్ కోయ శ్రీహర్షకు తల్లి దండ్రులు మొరపెట్టుకున్నారు. వారు ఫ్యాకల్టీని మందలించినా తీరు మార్చుకోలేదని సమాచారం. వేధింపులతో తాము సరిగ్గా చదువుకోలేకపోతున్నామని విద్యార్థినులు పేర్కొంటున్నారు. ఎవరికైనా చెబితే ఇబ్బందులకు గురిచేస్తుందనిభయాందోళనకు గురవుతున్నారు.



మానేరు వాగు వరదలో చిక్కుకున్న ఇసుక ట్రాక్టర్లు

ముత్తారం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడేడు మానేరువాగులో ఇసుక ట్రాక్టర్లు వరద ఉధృతిలో చిక్కుకున్నాయి. స్థానికుల వివరాలు మేరకు గరిమిల్లపల్లి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్లు రోజు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుంటారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పది ట్రాక్టర్లు మానేరు వాగులోకి వచ్చాయి. ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో ట్రాక్టర్లను బయటకు తీసే ప్రయత్నంలో వరదలో చిక్కుకొని డ్రైవర్లు అక్కడే ఉండిపోయారు. ఎల్ఎండీ గేట్లు ఎత్తడం వల్ల వరద ఒక్కసారిగా పెరిగిందని, దీంతో డ్రైవర్లు, కూలీలు అందులోనే ఉన్నారు. దీంతో స్థానికులు కొందరు నిర్మాణంలో ఉన్న వంతెనపై నుంచి తాళ్లు వేయడంతో వారు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. గంట సమయంలోనే వరద ఉధృతి పెరగడంతో ట్రాక్టర్లు నీటిలో మునిగాయి.



వరదలో చిక్కుకున్న ఇసుక ట్రాక్టర్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయాన్ని స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేళ్లలోనే వైఫల్యం చెందిందని, ప్రజల విశ్వాసం కోల్పోయిం దన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, బ్లాక్ మార్కెట్ చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మీస అర్జున్‌రావు, చింతల లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు, మహేందర్ యాదవ్, కందుల శ్రీనివాస్, కొమ్ము తిరుపతి, కోట నాగేశ్వర్, రాజేంద్ర ప్రసాద్, ఎల్లంకి రాజు, పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు



పెద్దపల్లి తహసీల్దార్‌ను కలిసిన జీపీవోలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నియమించిన గ్రామ పాలన అధికారులు శుక్రవారం విధుల్లో చేరారు. మండల వ్యాప్తంగా 18 మంది గ్రామ పాలన అధికారులు విధుల్లో చేరగా తహసీల్దార్ రాజయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



పెద్దపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మిలాద్ ఉన్ నబి పురస్కరించుకొని పట్టణంలోని ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జామా మజీద్ నుంచి పట్టణంలోని జండా చౌరస్తా కమాన్ ప్రగతినగర్ బస్టాండ్ అమర్‌నగర్ నుంచి జామా మజీద్ వరకు మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేశారు మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు

ఐటీఐలలో ప్రవేశాలకు అడ్మిషన్ల స్వీకరణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక కేంద్రాలలో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు పెద్దపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో ప్రవేశాలకు 10వ తరగతి, 8వ తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు 2025 ఆగస్టు నాటికి 14 ఏళ్ల వయసు కలిగి ఉండాలని, గరిష్ఠ పరిమితి లేదని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, దీనికి ఏటీసీ వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంపిక చేస్తారని వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఈ నెల 30 వరకు గడువు ఉందని, దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లించాల న్నారు. అభ్యర్థులు ఆధార్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందని, దరఖాస్తులో ఇచ్చిన సమాచారం మారితే సీటు రద్దవుతుందన్నారు. వివరాలకు జిల్లా కేంద్రంలోని ఐటీఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ④
- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు
- స్టేజ్ 2లో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు
- స్టేజ్ 2లో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం



జ్యోతినగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. 2400 మెగావాట్ల సామర్థ్యంగల టీఎస్ టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యా వరణ అనుమతులను(ఈసీ) గురువారం రాత్రి సర్క్యూలర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన 4 వేల మెగావాట్ల టీఎస్‌టీపీపీకి సంబంధించి 1600 మెగావాట్ల స్టేజ్1 ఇప్పటికే పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 2016లో శంకుస్థాపన అయిన స్టేజ్ 1 ఏడాదిన్నర క్రితం పూర్తయింది. మిగతా 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.

● తెలంగాణ సూపర్ థర్మల్ కేంద్రం నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మేరకు ఎన్టీపీసీ సంస్థ తెలంగాణలో 4 వేల మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాలని పేర్కొంది. ఈ మేరకు రామగుండం ఎన్టీపీసీలోనే 4వేల ప్రాజెక్టును నెలకొల్పేందుకు కేంద్రం ఎన్టీపీసీకి అనుమతినిచ్చింది. మొదటగా 1600 మెగావాట్ల ప్రాజెక్టును రామగుండంలో 2016లో మొదలుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ టీఎస్‌టీపీపీకి శంకుస్థాపన చేశారు. 5 సంవత్సరాలలో పూర్తి కావాల్సిన స్టేజ్ 1 కరోనా ఇతర కారణాల వల్ల 2023లో పూర్తయింది. స్టేజ్ 1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లను ప్రధాని మోదీ 2024లో జాతికి అంకితం చేశారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టుకు ఎన్టీపీసీకి గత ఏడాది ఎన్టీపీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అనుమతినిచ్చారు. సుమారు 29,800 కోట్ల రూపాయల వ్యయానికి బోర్డు అనుమతినిచ్చింది. దీంతో స్టేజ్ 2 నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. రెండో దశ కాంట్రాక్టు బీహెచ్‌ఈఎల్‌కు లభించింది. టీఎస్‌టీపీపీ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణాకే కేటాయిస్తారు. మరో ఒకటి, రెండు నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి. 2030 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు మొదలు పెట్టనుంది.

● కొనుగోలుకు ఒప్పందంపై సందిగ్ధత..

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2కు సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) విషయంలో ఇంకా సందిగ్ధత ఉంది. పీపీఏ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. స్టేజ్2 నుంచి యూనిట్‌కు 4.12 రూపాయలకు కొనుగోలు చేసుకునేందుకు ఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ రాష్ట్ర సర్కారు పీపీఏ చేసుకోలేదు. 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే కొనుగోలు చేసుకునేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ పీపీఏ మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. పీపీఏ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎన్టీపీసీ వేచి చూస్తున్నట్లు సమాచారం.

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 వివరాలు..

- **సామర్థ్యం:** 2400 మెగావాట్లు(800 మెగావాట్ల 3 యూనిట్లు)
- **ప్రాజెక్టు వ్యయం:** 29,800 కోట్లు
- **టెక్నాలజీ:** ఆధునిక సూపర్ క్రిటికల్ టెక్నాలజీ
- **నీటి సౌకర్యాం:** సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా సరఫరా
- **బొగ్గు లింకేజీ:** సింగరేణి నుంచి ఏడాదికి 11.5 మిలియన్ టన్నుల బొగ్గు

కరీంనగర్‌లో సినిమా షూటింగ్


ఎల్ఎండీ గేట్ల వద్ద జరుగుతున్న షూటింగ్

తిమ్మాపూర్ (మానకొండూర్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం వద్ద హీరో శ్రీకాంత్ సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఏడు కొండలవాడా వెంకటరమణ(గోవిందా గోవిందా) అనే శీర్షికతో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో డ్యామ్‌లో పడ్డ హీరోను చూస్తూ విలపిస్తున్న సంఘటన చిత్రీకరణ చేశారు. హీరోయిన్ లయ తదితర తారాగనం వివిధ పాత్రలలో నటించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌కు ఎన్నోసార్లు వచ్చాను... కానీ షూటింగ్ మాత్రం ఇదే మొదటి సారి అని అన్నారు. కరీంనగర్‌లో సినిమా షూటింగ్ చేయడం సంతోషంగా ఉందని ఇక్కడి అధికారులు, పోలీసులు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పది రోజులు ఇక్కడే షూటింగ్ జరుగుతుందన్నారు. నవంబరులో సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

● గంటపాటు నిలిచిన రాకపోకలు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గంగాధర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై గల రైల్వేగేటు శుక్రవారం మొరాయించింది. గేటు లేవకపోవడంతో గంట పాటు ప్రధానరహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్రఇబ్బంది పడ్డారు. అనంతరం సిబ్బంది మరమ్మతులు జరిపి గేటు ఎత్తారు. కరీంనగర్, జగిత్యాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గేటు లేవకపోవడంతో తీవ్రఇబ్బందులుపడ్డారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సమయానికి గమ్యం చేరలేకపోతున్నామని వాపోయారు. తరచుగా ఇదేపరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోయారు. అధికారులు గేటు మొరాయించకుండా చూసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

మందు బాబులకు జరిమానా

వేములవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 130మంది మందుబాబులకు వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు పట్టణసీఐ వీరప్రసాద్ తెలి పారు. 14రోజుల వ్యవధిలో మద్యం సేవించివాహనాలు నడుపుతూ పట్టుబడిన 130మందిని శుక్రవారం వేములవాడ న్యాయస్థానంలో హాజరుపరిచామని తెలిపారు. ఇందులో 30మందికి 10వేల చొప్పున, 30మందికి 5వేల చొప్పున, మరో70మంది వాహనదారులకు 2000 రూపాయల చొప్పున న్యాయమూర్తి ప్రవీణ్ జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాల నడిపిన వారికి కౌన్సె లింగ్ నిర్వహించి మరోసారి మద్యం సేవించకుండా వారితో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో శుక్రవారంఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో నలుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు పురుషులు, నలుగురు మహిళలు హుజూరాబాద్ మండలం చెల్పూర్ నుంచి ఆటోలో బయలుదేరి మొగిలిపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కేశవపట్నం గ్రామంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలుకాగా వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్

- రూ.2.4 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- పరారీలో ఇద్దరు


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన కంసాని అరుణ్ కారు డ్రైవర్‌గా, హమాలి కార్మికునిగా, టైల్స్‌వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదనపై దృష్టి పెట్టి గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడని తెలిపారు. ఈక్రమంలో కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బొల్లేద్దు మహేందర్, చీమల ఆకాష్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశా రాష్ట్రంలోని గుర్తుతెలియని వ్యక్తులనుంచి తక్కువధరకు గంజాయిని కొనుగోలు చేసి, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులకు, యువకులను లక్ష్యంగా చేసుకొని కిలో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇల్లందుకు చెందిన మహేందర్, ఆకాష్‌ల వద్ద అరుణ్ గంజాయి కొనుగోలు చేసి కారులో హుస్నాబాద్‌కు చేరుకున్నాడని తెలిపారు. హుస్నాబాద్, పెద్దపల్లి, ఓదెలప్రాంతంలో గంజాయిని విక్రయించి వస్తుండగా పొత్కపల్లి ఫంక్షన్ హాల్ శివారులో పోలీసులు కారును తనిఖీ చేయడంతో డిక్కిలో గంజాయి లభించిందని తెలిపారు. రూ.2.4 లక్షలవిలువచేసే 4.98కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరుణ్ పట్టుబడగా ఇల్లందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాష్‌లో పరారీలో ఉన్నారని ఏసీపీ తెలిపారు. గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై రమేష్, ఏఎస్‌ఐ రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజుయాదవ్, హరీష్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేష్‌లను డీసీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసం

- మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ అరెస్టు
- ఐపాడ్, 2 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం



నిందితుడు మాజీకార్పొరేటర్ కట్ల సతీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడిపెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మబలికి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లోకేష్, సాయి అనే మరోఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుడు కట్లసతీష్ వద్ద నుంచి ఒకఐపాడ్, 2 సెల్‌ఫోన్‌లు, ఇతర ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కరీంనగర్ సీసీఎస్ సీఐ ప్రకాశ్‌గౌడ్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ మెటా ఫండ్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని పట్టణానికి నునావత్ భాస్కర్‌ను నమ్మించాడు.

తనవద్ద డబ్బులు లేవని చెప్పగా బయట 5శాతం వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో 3రెట్లు అవుతాయని నమ్మబలికాడు. దీంతో భాస్కర్ 2024జూన్ 4న సరస్వతి నగర్‌లోని తన ఇంటిలో కట్లసతీష్‌కు 15లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి కింద ముట్టజెప్పాడు. ఆ తరువాత మరి కొందరిని ఈ స్కీంలో చేరిపిస్తే మరిన్ని లాభాలు వస్తాయని చెప్పగా నమ్మిన భాస్కర్ తనకు పరిచయం ఉన్న కళ్లెం పహిపాల్‌రెడ్డి, మహేందర్, అజ్మీర తిరుపతి, బి.చంద్రనాయక్, బాలు నాయక్, బి.చందు, కె.తిరుపతి, బి. మహేష్, మంగీలాల్, అరుణ్, రామచంద్రమూర్తి, జి.రాందాస్, జలపతి, జి ఫకీర్దాస్, ఆర్.వెంకటేశ్వర్‌రావు, వంగల రూప, మోతె కరుణాకర్‌రెడ్డిని అదే నెల 11న భాస్కర్ ఇంట్లో సమావేశపరిచాడు. మూడు నెలల్లో 3 రెట్లు లాభాలు వస్తాయని కట్లసతీష్ వారిని నమ్మించాడు. 17మంది వద్ద మధ్యవర్తి మోతె సాయి ద్వారా కోటి 20 లక్షలు రూపాయలు కట్ల సతీష్ తీసుకున్నాడు. కాని ఇంత వరకు ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. కట్ల సతీష్‌ను నమ్మి వడ్డీకి డబ్బులు తెచ్చి ఇచ్చామని, వడ్డీ కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని భాస్కర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● దర్శించుకున్న సినీ నటుడు చిన్న


సినీ నటుడు చిన్నకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్నఆలయానికి వచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు చిన్న..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ప్రముఖ సినీనటుడు చిన్న దర్శించుకున్నారు. శుక్రవారం రాజన్నఆలయానికి విచ్చేసినఆయన శ్రీస్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ళ జైలుశిక్షవిధిస్తూ శుక్రవారం జిల్లాజడ్జి కుంచాల సునీత తీర్పునిచ్చారు. 2017లో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి పట్టణానికి చెందిన బాలిక పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు కిరాణ షాపునకు వెళ్ళింది. ఇంటికి తిరిగి వెళ్తుండగా మందల రవి అను వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను ఇంటి వద్ద దింపుతానని ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. పట్టణ శివారుచెట్ల పొదల్లోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. కూతురు ఇంటికి రావడం లేదని తల్లి వెతుకుతుండగా బాలిక ఎదురుపడి జరిగిన విషయం తెలిపింది. తల్లి ఫిర్యాదుతో అప్పటిఎస్సై తడవేన శ్రీనివాస్ మందల రవిపై కేసు నమోదు చేశాడు. కోర్టు పీపీ బాదం రమేష్, అరెల్లి రాములు సాక్ష్యులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో జడ్జి పదేళ్ళ జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించారు. అలాగే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నుంచి బాధితురాలికి 2 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద


మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు రావడం శుక్రవారం స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 17,715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మళ్లీ ఎగువ మానేరు పరవళ్లు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు, సిద్దిపేటలోని కూడవెల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో మానేరు మత్తడి దూకుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు శుక్రవారం 14630 ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13000, మానేరు ములవాగు ద్వారా 1630క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. కాగా దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు, ప్యాకేజి10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజి9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.82 ఉండగా, నీటినిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.093 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.06టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతు వేదికలో షార్ట్‌సర్క్యూట్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతువేదికలో యూరియా పంపిణీ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్విచ్‌బోర్డులో ఒక్కసారిగా మంటలు చెరగడంతో రైతులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన అధికారులు, రైతులు మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది.


స్విచ్ బోర్డ్ వద్ద మంటలు

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య


అనిల్(ఫైల్)

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముకుంద అనిల్(22) గతఏడాదిగా కుటుంబసభ్యులకు దూరంగా ఉండి ఒంటరిగా ఉంటూ కిరణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండునెలలుగా అనిల్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఒంటరితనం భరించలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి బలవన్మరణం


శరత్ కుమార్(ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ గ్రామానికిచెందిన సంగ శరత్ కుమార్(23) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శరత్ డిగ్రీచదవడం మధ్యలోనే మానివేసి హార్వెస్టర్ కొనుగోలు చేసి దానిని నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా అతను సంవత్సరం నుంచి ఛాతినొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శరత్‌కుమార్ తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన స్నేహి తులకు తాను చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టినట్లు సమాచారం. కాగా ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణం కావచ్చని స్థానికులు చర్చించుకుంటు న్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో కొండూరుకు ఘన స్వాగతం

గంభీరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా విమానాశ్రయంలో నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఘన సన్మానం లభించింది. శనివారంలో సిమ్లాలో జరగనున్న జాతీయ సహకార సమావేశానికి (సహకార పునర్జీవం) కొండూరు హాజరుకానున్నారు. సమష్టి సహకార బలం ద్వారా ఐవైసీ-2025 కార్యక్రమం కోసం రవీందర్‌రావు హిమాచల్ ప్రదేశ్‌కు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యక్రమ ప్రతినిధులు రవీందర్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు.



సిమ్లా విమానాశ్రయంలో కొండూరు రవీందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ప్రాణాలకు రక్ష..

● నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం



సుభాష్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్నా.. ప్రమాదంలో గాయపడినా వైద్యసహాయం, అంబులెన్స్ వచ్చేవరకు ప్రాణాలను కాపాడటానికి అందించే తక్షణ వైద్య సహాయమే ప్రథమ చికిత్స. సెప్టెంబరు నెలలో రెండవ శనివారం ప్రపంచ ప్రథమచికిత్స దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రథమచికిత్స అంటే డ్రెస్సింగ్ నుంచి చిన్నవ్యాధుల చికిత్స, సీపీఆర్ (కార్డియాక్ పల్మనరీరెసాసిటేషన్)వరకు ఉంటాయి. ప్రథమచికిత్సకు నిపుణుడు లేదాశిక్షణ పొందిన వ్యక్తిలేదానిర్దిష్ట పరికరాలు, సామగ్రి అవసరం లేదు. అందుబాటులో ఉన్న వనరులతో పరిసరాలను తెలిసిన వ్యక్తికూడా ప్రథమచికిత్స అందించవచ్చు. అధికారిక ప్రథమచికిత్స ఉత్తమమైనప్పటికీ అప్పటివరకు కొన్ని ప్రాథమిక ప్రాణాలను రక్షించే పద్ధతులు, నైపణ్యాలను నేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

● ఎందుకంత ప్రాముఖ్యత..

అత్యసర పరిస్థితుల్లో ప్రతి సెకను విలువైనదే. సకాలంలో అందించే ప్రథమ చికిత్సవ్యక్తి ప్రాణాలను కాపాడుతుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రథమచికిత్స కీలకంగా పరిగణించబడుతుంది. ప్రమాదం జరిగిన ప్రదేశం, లేదా గాయపడిన వ్యక్తి ఉన్న ప్రదేశంచాలా దూరంలో ఉండవచ్చు. ఆ ప్రదేశం దూరంగా ఉండవచ్చు, నిపుణుడు చేరుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

● నిర్వహించే కార్యక్రమాలు

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై అవగాహన, శిక్షణను ప్రోత్సహించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీపీఆర్ టెక్నిక్‌లు, పేపర్ కట్ ఎలా చేయాలి, బ్యాండేజ్ ఎలా వేయాలి, వంటివి ప్రదర్శనల ద్వారా తెలియచేస్తారు. ప్రథమ చికిత్సను నేర్చుకోవడం వల్ల ఎంత ఉపయోగకరం. కొన్ని సందర్భాల్లో ప్రథమ చికిత్స తెలిసిన వారు చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడివారు అవుతారు.



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు
● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్
భారత ఆశలన్నీ నీరజ్‌పైనే

స్టార్లతో కళకళ



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్దేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక.మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంగ్‌ఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).
ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..
● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి
● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట
● 10 ఏళ్ల వరకు గడువు పెంపు
● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు
- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దిష్ట గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్‌ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్ 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు
● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అస్సోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ


ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ


బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

పత్తి రైతులకు శాపంగా సీసీఐ నిబంధనలు

(3వ పేజీ తరువాయి)

రాఘవాపూర్, నిమ్మనపల్లి, సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, కమాన్‌పూర్ మండలం గొల్లపల్లిలో జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. అక్కడే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది పొడవు పింజ గల పత్తి క్వింటాలుకు రూ.8110, మధ్య రకం పింజ గల పత్తికి 7,710 రూపాయల మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరలు అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. మూడేళ్లుగా రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. క్వింటాలుకు 7,400 రూపాయలు మించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మార్కెట్‌లోనే కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతులకు మద్దతు ధర దక్కాలంటే జిన్నింగ్ మిల్లుల వద్ద గాకుండా మార్కెట్ యార్డుల్లోనే పత్తిని కొనుగోలు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు అంటున్నారు. మార్కెట్‌లో కేంద్రం ప్రకటించిన మద్దతు ధర దక్క నప్పుడు, మార్కెట్‌లోనే సీసీఐ అధికారులు రైతుల నుం చి పత్తిని కొనుగోలు చేసి వారికి మద్దతు ధర కల్పిం చాల్సి ఉంటుంది. కానీ నామమాత్రంగా కేంద్రాన్ని ఏర్పా టు చేసి జిన్నింగ్ మిల్లు వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. పత్తిని జిన్నింగ్ మిల్లుల వద్దకు తీసుక వచ్చే రైతులకు అనేక ఆంక్షలు విధించి జిన్నింగ్ మిల్లు యజమానికే తక్కువ ధరకే అమ్ముకునేలా చేస్తున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో క్రాప్ బుకింగ్ జరుగుతు న్నది. సీసీఐకి పత్తి విక్రయించాలంటే, పంట పండించి నట్లు మండల వ్యవసాయాధికారి నుంచి ధ్రువీకరణతో పాటు క్రాప్ బుకింగ్ యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేయాలి. ఇంకా ఇది జరగకపోవడంతో కొందరు వ్యాపారులు వ్యవసాయాధికారుల నుంచి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని సీసీఐకి పత్తి అమ్మి లబ్ధి పొందుతున్నారు. గత ఏడాది ఆయా మార్కెట్ యార్డుల కార్యదర్శులను సస్పెండ్ చేసింది. కొన్నింటిపై విచారణ జరిపింది. ఈసారి సర్వే పకడ్బందీగా నిర్వహిస్తేనే రైతులకు ఇబ్బందులు తొలుగుతాయి. జిన్నింగ్ మిల్లుతో సంబంధం లేకుండా వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి మార్కెట్‌లోనే సీసీఐ కొను గోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభు త్వాన్ని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూరు, పెద్దకల్వల, నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ మరమ్మతు దృష్ట్యా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు సరఫరాలో ఉండదన్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గౌతమినగర్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమినగర్, చంద్రశేఖర్‌నగర్, ఖాజీపల్లి, సంజయ్‌గాంధీనగర్, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని, గుంజపడుగు, నాగారం సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం కల్గుతుందని అధికారులు తెలిపారు.

గురుకులాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గురుకులాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉండేలా రోజు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. గురుకులాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమ శాఖ పనితీరుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీజీఐపాస్ కింద పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్దిష్ట గడువులోగా అనుమతులు జారీ చేయాలన్నారు. టామ్ కామ్ ద్వారా విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలను యువత వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఈ అంశాన్ని జిల్లా ఉపాధి అధికారి పర్యవేక్షించాలన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, రోడ్డు రవాణా అధికారి రంగారావు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ చేయాలి

ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల, జిపి బిల్డింగ్స్ అమలు పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బేస్మెంట్ స్థాయికి చేరుకున్న ఇండ్ల వివరాలు పోర్టల్ లో నమోదు చేసి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల జరిగేలా చూడాలన్నారు.

న్యాయం చేయాలని బాధితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

కమాన్‌పూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భూమి విక్రయం పేరుతోపాటు అక్కర నిమిత్తం తీసుకున్న లక్షలాది రూపాయల డబ్బులు తిరిగి ఇప్పించాలని రొంపికుంట గ్రామానికి చెందిన గుమ్మడి హైమవతి శ్రీనివాస్ ఇంటి ఎదుట పలువురు బాధితులు శుక్రవారం నిరసన తెలిపారు. గుమ్మడి శ్రీనివాస్ అనే వ్యక్తి 10 గుంటల వ్యవసాయ భూమి విక్రయం కోసం మూడేళ్ల క్రితం ఒకరి వద్ద రూ.21 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకపోగా, దానిని గతంలోనే మరొకరికి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపాడు. మరో బాధితుడు నాగారం గ్రామానికి చెందిన మాడిశెట్టి బాలకృష్ణ వద్ద 2011లో రూ.4 లక్షల అప్పు తీసుకొని ఇవ్వకుండా పలు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయాడు. అఫ్జల్ అనే బాధితుడు మాట్లాడుతూ 2014లో రూ.2.50 లక్షలు తీసుకొని ఇప్పటి వరకు ఇవ్వలేదని, రెండు గుంటల స్థలాన్ని రాసి ఇచ్చాడని తెలిపాడు. కాగా గుమ్మడి శ్రీనివాస్ తల్లి గుమ్మడి లక్ష్మీతోపాటు ఆమె చిన్న కుమారుడు రామకృష్ణలు మాట్లాడుతూ రొంపికుంటలో ఉమ్మడిగా ఉన్న 7 ఎకరాల భూమిని సాగు చేసుకుంటామంటే ఇచ్చామని, శ్రీనివాస్ తమకు తెలియకుండానే అక్రమంగా పట్టా చేసుకున్నట్లు తెలిపారు. తాము ఒడిశా రాష్ట్రంలో ఉండటంతో భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న విషయం ఆలస్యంగా తెలిసిందని కుటుంబ సభ్యులు వాపోయారు. మరెవరు మోసపోవద్దని చెప్పడానికి తాము ఇక్కడికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు బాధితులు శుక్రవారం గుమ్మడి శ్రీనివాస్ ఇంటి ఎదుట వంటావార్పు చేసుకొని నిరసనలు తెలిపారు. తమకు న్యాయం చేయాలని అధికారులను, పోలీసులను బాధితులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దివ్యదర్శనరావు అన్నారు. గర్రెపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో సమావేశం నిర్వహించి నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకొని, ప్రభుత్వం ద్వారా బిల్లులు పొందాలని సూచించారు. ఈ నెలాఖరులోగా నిర్మాణం ప్రారంభించని ఇండ్లను రద్దు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకుంటే ఆన్‌లైన్ చెల్లింపులు నిలిచిపోతాయని అన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి

ఎలిగేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీల చైతన్య స్ఫూర్తిని చాటి చెప్పేందుకు ఈ నెల 14న కరీంనగర్‌లో బీసీ ఇంటెక్చ్యువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, బీసీ సంఘం నాయకులు మహేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ సమాజానికి జరుగుతున్న అన్యాయాలను సమాజానికి వివరిస్తామని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు హాజరవుతున్నట్లు తెలిపారు.

జనరల్ ఆసుపత్రిలో విద్యార్థులకు అవగాహన

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం రమేష్ నగర్ వాసవ్య పాఠశాల విద్యార్థులకు వైద్యులు క్షేత్ర స్థాయి అవగాహన కల్పించారు. ఆర్ఎంఓ రాజు ఆధ్వ ర్యంలో బ్లడ్ బ్యాంక్, ఓపీ విభాగాలు, ఐసీయూ, జనరల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అనారోగ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ విక్రమ్‌వర్మ టీచర్లు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్‌ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

జూలపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని జిల్లా ఫొటో వీడి యోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21 తేదీలలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పెద్దపల్లి, జూలపల్లి మండలాల అధ్యక్షులు వనపర్తి శ్రీనివాస్, వేల్పుల రాంమూర్తి, కొండ మల్లేశం, కనపర్తి అందె సతీష్, వేల్పుల సంపత్,బద్రి పలువురు పాల్గొన్నారు.

ఓదెల దేవస్థానం చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఓదెల దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్యతోపాటు పలువురు డైరెక్టర్లు ఉప్పుల శ్రవణ్‌కుమార్, కట్కూరి సమ్మిరెడ్డి, కొండ శ్రీనివాస్‌లను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి సన్మానించారు. మొండయ్య మాట్లాడుతూ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే విజయరమణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఓదెల దేవస్థానం అభివృద్ధికి ఎమ్మెల్యే మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేశారని, దానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధికి పనులు చేస్తానని తెలిపారు. ఓదెల నుంచి దేవస్థానం ద్వారా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి వరకు ఎమ్మెల్యే డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు బంగారు రమేష్, అల్లం దేవెందర్, రానవేన శ్రీనివాస్, పొన్నమనేని దేవెందర్‌రావు, సబ్బని రాజమల్లు, ఎనగంటి రవి, ద్యాగేటి రామచంద్రం, కలవేన రాజయ్య, మొగిలి సదానందం తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కుంట ఆక్రమణ పై ఈవోకు వినతి

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆలయ సమీ పంలోని మల్లన్న చిన్న కుంట ఆక్రమణకు గురవుతుం దని శుక్రవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఈవో సదయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించి జీవనోపాధిగా ఉన్న కుంటను కాపాడాలని కోరారు. రాములు, సురేష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ పి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, గ్యాస్ లీక్ అయినప్పుడు మంటలను ఆర్పాలనే విషయాలను తెలిపారు. ఫైర్‌సిబ్బంది మంటలను ఏవిధంగా ఆర్పి వేయాలో విద్యార్థులతో చేసి చూపించారు. ఎల్లప్ప, రమేష్ డిఓపీ జిసురేష్‌బాబు, ఎఫ్ఎంఎస్ ఎఫ్ మనోహర్, బి.శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం జ్యోతి, విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

ధర్మారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్‌తోపాటు విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులతోపాటు ప్రిన్స్‌పాల్‌ను కలెక్టరేట్‌కు పిలిపించుకొని అభినందించారు. త్వరలోనే పాఠశాలను సందర్శించి క్రీడా మైదానం, ఐఎఫ్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.




సీఐటీయూ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సొంతింటి కలపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. డివిజన్‌లో నిర్వహించిన సేకరణలో 1927 ఓట్లు పోలు కాగ అందులో 1910 సొంత ఇల్లు కావాలని, 15 మంది క్వార్టర్ కావాలని, 2 ఓట్లు చెల్లని ఓట్లు పోలయ్యాయని సిఐటియు కార్యదర్శి దొమ్మటి కొంరయ్య తెలిపారు. నాయకులు కుమార్, కాటేశ్వర్లు, సత్తయ్య, వేణుగోపాల్, శ్రీనివాస్, గోపాల్, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజేష్, విజేందర్‌రెడ్డి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి కల్పించే నైపుణ్యాభివృద్ధి కోర్సులలో నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకొవాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు అన్నారు. సెంటినరీ కాలనీలోని సేవా భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెంటినరీకాలనీలో పాటు రత్నాపూర్, ఆదివారంపేట్, లద్నాపూర్ గ్రామాలలో నిర్వహించే టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటిషియన్ కోర్సులలో శిక్షణ పొందాలని సూచించారు. శిక్షణ పొందిన 183 మహిళలకు ఖాదీ గ్రామోద్యోగ్ విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కమ్యూనిటిహాల్‌లో రాత పరీక్షలను నిర్వహించారు. శివకుమార్, రాజశేఖర్, ఉమాదేవి, అరుణ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్యామిలీ డే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీఎం దంపతులు

గోదావరిఖని, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా కాలరీ ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని సీఈఆర్ క్లబ్‌లో ఫ్యామిలీ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్-1ఎం, క్లబ్ అధ్యక్షులు లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. క్లబ్ సభ్యులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి, లక్కీడిప్‌లో గెలుపొందిన వారికి జీఎం, సేవా అధ్యక్షురాలు బహుమతులు అందజేశారు. ఉద్యోగుల మానసికోల్లాసానికి ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం రమేష్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ పోషం, సెక్రెటరీ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, రవీ, బ్రహ్మాజీ, హనుమంత రావు, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని, లాభాల వాటా రూ.20 వేలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విక్రమార్కకు సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రితో సమస్యలపై చర్చించారు. సింగరేణిలో కాంటాక్ట్ కార్మికుల శ్రమతోనే లాభాలు వస్తున్నాయని, కోల్ ఇండియాలో కాంటాక్ట్ కార్మికులకు రోజుకు రూ.1285 చెల్లిస్తుంటే సింగరేణిలో కేవలం రూ541 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన కనీస వేతన జీఓల విడుదలలో జాప్యం జరుగుతున్నదని, ఫలితంగా కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. సింగరేణి సాధిస్తున్న లాభాలల్లో కాంటాక్ట్ కార్మికుల శ్రమ ఉన్నదని దానికి అనుగుణంగానే రూ.20వేల లాభాల వాటా చెల్లించాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి జేఏసీ నాయకత్వం సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్, కార్మిక శాఖ మంత్రి జీ వివేక్ కలిసి సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యలు కనీస వేతనాలు జీఓలపై చర్చించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ త్వరలోనే రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచుతామని పేర్కొన్నారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. కనీస వేతనాలు సలహా మండల చైర్మన్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనాల బోర్డులో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపామని జీవోలు వచ్చేంత వరకు వేతనాలు పెంచేందుకు యాజమాన్యం పై ఒత్తిడి తెస్తామన్నారు. బి మధు, యాకూ బ్ షావలి, కరుణాకర్, యాకయ్య, బాబు, మల్లెల రామనాథం, రామ్‌సింగ్, భూక్యా రమేష్, వేల్పుల కుమారస్వామి, అరవింద్, మహేందర్, ఒదేలు, రాజశేఖర్, అరవింద్, స్వామి, క్రాంతి, శరత్, రఘు, పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ప్రతినిధులతో సమావేశం

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో జీఎం సుధాకర్‌రావు అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రాజెక్టులు, గనులు, కాలనీల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం పై చర్చించారు. రాణిరుద్రమాదేవి క్రిడప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, పంచ్ ఏంట్రిలో త్రీ సిమ్ వరకు నీటి అందించడం, ఓసిపి-2 ప్రాజెక్టులో నూతన విశ్రాంతిగది, ల్యాంప్‌రూమ్ అంశాల పై చర్చించారు. ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, రామచం ద్రారెడ్డి, రాంచందర్, తిరుపతిరావు, శేఖర్‌బాబు, సుదర్శనం, రాజేంద్రకుమార్, ఉదయ్‌భాస్కర్, చంద్రశేఖర్, విక్రమ్, పాల్గొన్నారు.

స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించాం

గోదావరిఖని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒప్పుకున్న అంశాలను కూడా సర్క్యులర్ లు జారీ చేయకుండ కాలయాపన చేయడంతో గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో శుక్రవారం సింగరేణి భవన్‌లో జరిగిన స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించినట్టు ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరణ అనంతరం సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫీస్‌లో వారు మాట్లాడుతూ ఇప్పటికైన యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా



జీఎం కార్యాలయం వద్ద వినతిపత్రం అందచేస్తున్న బీఎంఎస్ నాయకులు

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట డిమాండ్లు పరిష్కరించాలని శుక్రవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిబిఎస్ఈ ఉచిత విద్య అందించాలని, గోదావరిఖనిలో కార్పొరేట్ హస్పిటల్ ఏర్పాటు చేసి ఉచిత వైద్యం, కొత్త గనులు ఏర్పాటు చేయాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లింపు చేపట్టాలని, లాభాల్లో 40 శాతం బోనస్ చెల్లిం చాలనే ప్రధాన డిమాండ్ల పై పర్సనల్ మేనే జర్‌కు వినతిపత్రం అందజేశారు. పొన్నమనేని వేణు గోపాల్‌రావు, అరుకాల ప్రసాద్, రౌతు రమేశ్, విద్యాసాగర్, రాజమహేందర్‌రెడ్డి, కృష్ణ, జానీ, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం(బీఎంఎస్) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, డివిజన్ కమిటీ సభ్యులు మేడా రామ్మూర్తి, గంగిసెట్టి నరసింహులు, సంగని సాంబయ్య, జంగం తిరుపతి, రాజశేఖర్, పిట్ సెక్రటరీలు పల్లె శ్రీనివాస్, పెంచల వెంకటస్వామి, తుమ్మ గట్టయ్య, పోతవేని భాస్కర్, పుప్పల నాగేంద్రప్రసాద్, చెన్నా సతీష్, పోరండ్ల వెంకటేస్, నవీన్, వంశీ, పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ఘన స్వాగతం

పెద్దపల్లిటౌన్/సుల్తానాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికై మంచిర్యాలకు వెళ్తున్న వెరబెల్లి రఘునాథ్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కమాన్ చౌరస్తాలో గజమాలతో సత్కరించారు. తంగెడ రాజేశ్వర్ రావు, శిలారపు పర్వతాలు, పోల్సాని సంపత్ రావు, కారంగుల శ్రీనివాస్, సంపత్ కుమార్, కావేటి రాజగోపాల్ మేకల శ్రీనివాస్ ఈర్ల శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు

సుల్తానాబాద్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ఐబీ చౌరస్తా వద్ద ఆయనను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, కొమ్ము తిరుపతి యాదవ్, రఘుపతిరావు, నాగులమల్యాల తిరుపతి, కోట నాగేశ్వర్, ఏగోలపు శ్రీనివాస్, ఎల్లంకి రాజు, మెండ శంకరయ్య, గజబీంకర్ పవన్, కందునూరి కుమార్, గుడ్ల వెంకటేష్, సాయి, హనుమంత రెడ్డి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

సుల్తానాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో శుక్రవారం నమునా ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడానికి, నాయకత్వ లక్షణా లు పెంచడానికి సమర్ధవంతమైన పాఠశాల నిర్వహణకు విద్యార్థి నాయకులను ఎన్నుకున్నట్లు అధ్యాపకులు తెలిపారు. ప్రిన్సిపాల్ గోల్డిబల్బీర్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ కొండయ్య, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, అనిల్, సంధ్య పాల్గొన్నారు.

పాత రోడ్డులోనే బైపాస్ నిర్మించాలి

మంథనిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంథని గోదావరి నదిలో నిర్మించ తలపెట్టిన వంతెన బైపాస్ రోడ్డును వేరే చోటు నుంచి మళ్లిస్తున్నారని, అలా కాకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డు ద్వారా నే బైపాస్ రోడ్డు నిర్మించాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేసినట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి శుక్రవారం తెలిపారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన రోడ్డు ద్వారా ప్రజలకు, రైతులకు రహదారి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఆర్యవైశ్య సంఘం మహిళా జిల్లా కోశాధికారిగా రేణుక

మంథని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం కోశాధికారిగా పట్టణానికి చెందిన రావికంటి రేణుకను నియమిస్తూ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అల్లంకి లింగ మూర్తి శుక్రవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడు జిల్లా నల్మాస్ ప్రభాకర్ అనుమతితో ఆమెను నియమించినట్లు తెలిపారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

కమాన్‌పూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీశ్రావ్య ఇటీవల గోదావరిఖనిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్‌లో కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, పీడీ రేణుక, ఎస్ఏ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

తరగతి గదులు ప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిట్టలఎల్లయ్యపల్లిలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి గదులను ఎంఈవో రమేష్, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, తరగతి గదుల కొరత లేకుండా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు సుమలత, కార్యదర్శి అమూల్య, మౌనిక, రేణుక, కనుకయ్య, పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి

ఎలిగేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతు పక్షపాతిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన హామీల అమలులో విఫలం చెందిందన్నారు. రెండు నెలలుగా యూరియా కోసం రైతులు ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజుల్లో యూరియా పంపిణీ జరగాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆర్కే రాజా, చీకటి సంతోష్, న్యాతరి పోచయ్య, బాపయ్య, కొత్తిరెడ్డి శాంతిరెడ్డి, కాసర్ల కోమల్ రెడ్డి, గొల్లె లక్ష్మణ్, బాసంపల్లి రాజేష్, వినోద్, పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు మరమ్మతు చేయాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, కళాశాలలను, సంక్షేమ హాస్టల్స్‌ను పునఃనిర్మించాలని కలెక్టర్ శ్రీహర్షను ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిఆజాద్, జిల్లాకోశాధికారి ఎల్కపల్లిసురేష్ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని కోదండ రామాలయం-శివాలయంలో ఆలయ ఈవో, జూనియర్ అసిస్టెంట్‌లు అక్రమాలకు పాల్పడుతూ దేవుని సొమ్ము కాజేస్తున్నారని ఓ భక్తుడు దేవాదాయ శాఖ కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. విధులను సక్రమంగా నిర్వహించకుండా ఇద్దరు ఏకమై దేవాలయానికి రావాల్సిన ఆదాయాన్ని వారి ఖాతాలలోకి బదిలీ చేసుకొంటున్నారని ఎల్‌బీనగర్‌కు చెందిన మామిడి కుమారస్వామి ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తగిన విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకొని దేవాలయానికి సంబంధించిన ఆస్తులు కాపాడాలని కోరాడు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ధర్మారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జన ఊరేగింపులో పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న కొత్తపల్లిలో గణపతి నిమజ్జనం ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ర్యాలీలో గొడవ జరుగుతున్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన భూక్య రవినాయక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పల్లెల్లో ప్రారంభమయిన బొడ్డెమ్మ సందడి

పాలకుర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. బొడ్డెమ్మ..బొడ్డెమ్మ కోల్.. అంటూ వాడవాడనా ఆడబిడ్డలు సందడి చేస్తున్నారు. చిన్నారులు, యువతులు, మహిళలు ఆడి పాడుతున్నారు. పెద్దబతుకమ్మకు 9రోజుల ముందు నుంచి ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. గుమ్మడి, తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి మధ్యలో పసుపుతో తయారు చేసిన బొడ్డెను పెట్టి పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేస్తున్నారు.

సెల్‌ఫోన్ వాడకంలో జాగ్రత్త వహించాలి

ధర్మారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు సెల్‌ఫోన్ వాడకంలో జాగ్రత్త వహించాలని బాలల సంరక్షణ అధికారి నిర్మల సూచించారు. శుక్రవారం నందిమేడారం పీహెచ్‌సీ డాక్టర్ సుస్మిత ఉన్నత పాఠశాల హెచ్ఎం షీలా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిలర్ వెంకటస్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.